


మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# మహిళా సాధికారతయే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



మహిళా సమైక్య భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** మహిళా సాధికారతయే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లమర్రి గ్రామంలో వికసిత్ భారత్ జిరాంజీ పథకం కింద రూ. 10 లక్షలు మంజూరైన మహిళా సమైక్య నిర్మాణానికై ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ వారిని ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని ఆయన కోరారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. భవన నిర్మాణ పనులు నాణ్యవంతంగా చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎసమోని లక్ష్మీ ఆంజనేయులు, విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ విజయభాస్కర్ రెడ్డి, ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు, పంచాయతీ కార్యదర్శి అన్వేష ,పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు. వడ్డేమాన్ లోవడ్డేమాన్ లో గ్రామ సర్పంచ్ ఈశ్వర్ సింగ్ మండల మహిళా భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. మహిళాభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో రెండు లక్షలు మంజూరు కాగా మూత్రశాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు, ఉపసర్పంచ్ మహమూద్, పంచాయతీ కార్యదర్శి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

## భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**గద్వాల ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** భూభారతి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని అన్ని మండలాల తహసిల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి. ఎం. సంతోష్ మాట్లాడుతూ ఆర్డీవో స్థాయిలోనే 1370 భూభారతి దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, సంబంధిత మండలాల రెవెన్యూ అధికారులు కూడా తమ పరిధిలోని భూభారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. కుల, ఆదాయ, తదితర ధ్రువీకరణ పత్రాలతో పాటు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను కూడా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ల్యాండ్స్ సర్వే విషయంలోనూ నిరక్ష్యం వహించకుండా లైసెన్స్ సర్వేయర్ల సహకారం కూడా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. భూ నిర్వాసితుల పునరావాస కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను కూడా సంబంధిత శాఖల అధికారుల సహకారంతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలి అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఎస్ఐ ఆర్ మ్యాపింగ్ లో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా సంబంధిత సూపర్వైజర్స్, బిఎల్ వోల కు రెవిన్యూ అధికారులు సహకరించాలన్నారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలను తహసిల్దారులు తరచూ సందర్శిస్తూ తనిఖీలు చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించే అధికారులను ఉపేక్షి ంచేది లేదని, నిరక్ష్యంగా వ్యవహరించే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, సర్వే ఏడి నూకరాజు, ఆయా మండలాల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

## యువతలోని సామర్థ్యాన్ని వెలికితీసే సాధనం క్రీడలు

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**ఉత్సాహంగా సీఎం కప్ పోటీలు ప్రారంభం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే మహత్తర సాధనం క్రీడలే" అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా క్రీడా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో 2వ ఎడిషన్ రాష్ట్ర స్థాయి సీఎం కప్-2025 పోటీలు (బాక్సింగ్ నెట్‌బాల్) ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే పరిమితం కాకుండా, మానసిక స్థైర్యం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సమయపాలన, సహనశక్తి వంటి విలువలను పెంపొందించే -మిగతా4లో..



బోగస్ ఓటర్ల జాబితా పై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న గువ్వల బాలరాజు

## బోగస్ ఓటర్లపై ప్రత్యేక దృష్టికి సారించండి : మాజీ ఎమ్మెల్యే

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వార్డుల్లో ఓటర్ లిస్టు పరిశీలన పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కోరారు. శుక్రవారం అచ్చంపేట రెవెన్యూ డివిజన్ అధికారి యాదగిరి , తహసీల్దార్ సైదులు గౌడ్‌ను కలిసి వివరించారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితా పై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి బోగస్ ఓటర్లు, ఒకే వ్యక్తిపై రెండు, మూడు ప్రాంతాల్లో ఓటర్ లిస్టులో పేరు ఉండడం పై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఓటర్ లిస్టులో ఉన్న ఓటర్ నమోదుకు ఆధార్ అనుసంధానం సకాలంలో చేయలేకపోయారని, చనిపోయిన వారి పేర్లు ఉండడం, ఒకే వ్యక్తికి మూడుసార్లు ఓటు రావడం రాజకీయ విరుద్ధమని, అనర్హులైన ఓటర్ల ను గుర్తించి సత్వరమే ఓటర్ జాబితా నుంచి తొలగించాలని కోరారు. రెవెన్యూ ఆధికారులు ప్రత్యేక దృష్టి సారించి బోగస్ ఓటర్ల ఏరివేతకు శ్రీకారం చుట్టాలని ఆయన కోరారు. అచ్చంపేట పట్టణంలో రాబోయే ఎన్నికల్లో -మిగతా4లో..

## అట్టహాసంగా సీఎం కప్ కబడ్డీ పోటీలు



కీడాజ్యోతిని వెలిగించిన మంత్రి వాకిటి శ్రీహరి

**మఖ్తల్ వాసిగా మఖ్తల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం నా అదృష్టం ..**

**ఈసారి బడ్జెట్లో క్రీడలకు రూ.1600 కోట్లు కేటాయింపు**

**స్పోర్ట్స్ రిజర్వేషన్ 2 నుంచి 5 శాతానికి పెంపునకు చర్యలు**

**తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి**

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో సీఎం కప్ రెండో ఎడిషన్ లో భాగంగా శుక్రవారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించడం మఖ్తల్ వాసిగా తన అదృష్టమని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి అన్నారు. కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎస్పీ వినీత్ కుమార్ తో కలిసి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు 33 జిల్లాల నుంచి పురుషులు మహిళల విభాగంలో 66 జట్లు తలపడనుండగా, దాదాపు 1500 మందికి పైగా క్రీడాకారులు కోచ్‌లు, పీఈటీలు, సహాయక సిబ్బంది పాల్గొంటారని, వారికి మక్తల్‌లో అన్ని సదుపాయాలు కల్పిస్తూ సరైన వసతి, ఆహారం సూచించిన మేరకు అందిస్తూ మంచి ఆతిథ్యం కల్పిస్తున్నామని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో సరికొత్త క్రీడా పాలసీని తీసుకొచ్చామని, ఇందులో భాగంగా దాదాపు 25 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు క్రీడారంగంలోకి వచ్చాయని తెలిపారు. గతంలో బడ్జెట్లో క్రీడా శాఖకు కేవలం ఏడాదికి 200 కోట్ల నుంచి 300 కోట్లు మాత్రమే కేటాయించే వారిని, రాబోయే బడ్జెట్లో ఏకంగా క్రీడా శాఖకు రూ.1600 కోట్ల బడ్జెట్ ను ముఖ్యమంత్రి కేటాయిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. దీంతోపాటు క్రీడాకారులకు స్పోర్ట్స్ రిజర్వేషన్ ను 2 శాతం నుంచి 5 శాతానికి పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 120 మంది అంతర్జాతీయ క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్రం నుంచి విదేశాల్లో అంతర్జాతీయ టోర్నీలో పాల్గొనడానికి దాదాపు రూ.600 కోట్ల రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిందని, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనే వారికి రవాణా ఖర్చులతో పాటు ఇతర ఖర్చులు సైతం రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని భరోసా ఇచ్చారు. ఒలింపిక్స్ లాంటి అంతర్జాతీయ స్థాయి క్రీడా ఈవెంట్లలో మెడల్ సాధించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫునుంచి నేరుగా రూ.3 కోట్ల 50 లక్షల ప్రోత్సాహక బహుమతి అందిస్తున్నామని అన్నారు. గతంలో ఆటలు ఆడితే తల్లిదండ్రులు తిట్టే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆటలు ఆడకపోతే తిట్టే పరిస్థితి ఉందని, ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. కబడ్డీ పోటీకి 4 వేల సంవత్సరాల చరిత్ర ఉందని, ఇప్పటికే భారత జట్టు కబడ్డీలో మూడు వరల్డ్ కప్ లు సాధించిందని గుర్తు చేశారు. ప్రో కబడ్డీ లీగ్‌లో సైతం ప్లేయర్లకు చాలా డిమాండ్ ఉందని అన్నారు. మక్తల్ గ్రౌండ్ తో తనకు విడదీయరాని అనుబంధం ఉందని, రక్తాలు కారే వరకు ఆటలాడేవాళ్ళమని, తర్వాత రోజు గాయాలు తెలిసేవని అన్నారు. రూ.25 కోట్లతో మక్తల్ గ్రౌండ్ ను స్టేడియంగా రూపొందిస్తున్నామని, ఇందులో స్విమ్మింగ్ పూల్‌తో పాటు రెండు కబడ్డీ - మిగతా4లో..




జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్

## ప్రణాళిక బద్ధంగా మున్సిపాలిటిని అభివృద్ధి చేస్తాం

**వారానికోవార్డు చొప్పున**

**అన్ని వార్డుల సమస్యలను పరిష్కరిస్తాం**

**వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల పదవి బాధ్యతల స్వీకరణ**

**వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** ప్రణాళిక బద్ధంగా పని చేసే వనపర్తి మున్సిపాలిటిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, వారానికి వార్డు సందర్శించి సమస్యల పరిష్కారానికి పాటు పడతామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్ల పదవీ బాధ్యత స్వీకరణ కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ చేపట్టారు. వనపర్తి ఇందిరాపార్క్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి వివేకానంద చౌరస్తా పాలిటెక్నిక్ కళాశాల రాజీవ్ గాంధీ చౌరస్తా అంబేద్కర్ మీదుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్‌గా మాధవి రమేష్, వైస్ చైర్మన్‌గా మధుసూదన్ గౌడ్‌తో పాటు మరో 20 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే సమక్షంలో పదవీబాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ మాధవి తన మొట్టమొదటి సంతకాన్ని మున్సిపల్ ఉద్యోగులకు అందించే అలవెన్స్ ఫైల్ పై, తాగు నీటి సమస్యల పరిష్కారం ఫైల్ పై సంతకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పది ఏళ్లలో నాలుగు రోడ్లు, రెండు చెరువు కట్టలపై రెవిట్మెంట్లు కట్టి మామూలు దొబ్బిన నాయకులు అదే అభివృద్ధి అనుకున్నారు. అభివృద్ధి అంటే గల్లీ నుంచి మొదలై మెయిన్ రోడ్డుకు చేరుకోవాలని వనపర్తి పట్టణంలోని ప్రతి గల్లీని సందర్శించి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే రూ.54 కోట్లతో ప్రతి వార్డులో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టామని రూ.50కోట్లు వనపర్తి పట్టణానికి, రూ.20 కోట్లు పెబ్బేరు పట్టణానికి మంజూరు చేయించి పట్టణాన్ని అన్ని రంగాల్లో సుందరీకరణ తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు. వనపర్తి పట్టణానికి 2000 ఇందిరమ్మ ఇండ్లు, పెబ్బేరు పట్టడానికి 500 ఇందిరమ్మ ఇండ్లు అధినంగా మంజూరు చేయించి ఇల్లు లేని ప్రతి నిరుపేదకు సొంత ఇంటి కల నెరవేరుస్తామన్నారు. ప్రతి వార్డు అభివృద్ధి చెందాలని అభివృద్ధి పనులకు నిధులు లేవనే మాట రాకుండా అవసరమైతే తన నిధుల నుంచి కూడా ఖర్చు చేసి అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామన్నారు. నేటి నుంచి అందరిపై గురుతరమైన బాధ్యతలు ఉన్నాయని వాటిని విస్మరించకుండా నిర్లక్ష్యం చేయకుండా అవినీతి అక్రమాలకు తావు లేకుండా ఉపయోగించి పట్టణ ప్రజల మన్ననలు పొందుతామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వ సుజాత, వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ , వనపర్తి మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దలు మహిళలు యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

## నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి

**- మున్సిపాలిటి ఎన్నికల్లో హస్తం వైపు నిలిచిన ఓటర్లు**

**- కల్వకుర్తి, ఆమనగల్లు మున్సిపాలిటిలకు సీఎం చొరవతో ప్రత్యేక నిధులు**

**కల్వకుర్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** కల్వకుర్తి, ఆమనగల్లు మున్సిపాలిటిలకు సీఎం చొరవతో ప్రత్యేక నిధులు కేటాయించి వాటి అభివృద్ధితో పాటు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ చైర్మన్ పదవి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్‌కు, మున్సిపల్ వైస్ చైర్మన్ షాన్‌వాజ్‌ఖాన్‌లను సన్మానించి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో అధిక నిధులు తీసుకొచ్చి కల్వకుర్తి, ఆమనగల్ పట్టణాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ పాలన సాగిస్తామన్నారు. ఇకనుంచి రాజకీయాల కంటే ఎక్కువగా అభివృద్ధిపై దృష్టి పెడతానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడమే తమ లక్ష్యం అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోడీ రూపాయి ఇవ్వడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్ని పర్యాయాలు కలిసిన స్పందనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమనగల్ మున్సిపాలిటీ చైర్మన్ పదవిపై నాకు ఏమి సంబంధమన్నారు. మీ పార్టీ కౌన్సిలర్లను కాపాడటంలో విఫలం చెందిన మీరు తనపై నిందలు వేయడం సరికాదని బిఆర్ఎస్ నేత ఉప్పల వెంకటేష్‌పై పరోక్షంగా ఎమ్మెల్యే విమర్శలు సంధించారు. మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకుంటే బాగుంటుందని హితవు పలికారు. తప్పుడు పనులు చేయాలని తన ఆలోచన కాదని దానికి నేను పూర్తి వ్యతిరేకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంపీ మల్లురవి సమక్షంలో పత్యానాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని అట్టి విషయాన్ని తనకు ఆపాదించడం బిఆర్ఎస్ నాయకులకు తగదని హెచ్చరించారు. తన మంచితనాన్ని చులకనగా చూడొద్దని, తాను గర్జిస్తే గాలిలో కొట్టుకుపోతారని ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్, కౌన్సిలర్లు పట్టణ అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం చైర్మన్ రత్నమాల మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంగా గెలిపించి చైర్మన్ బాధ్యతలను అప్పగించారని, వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ఎమ్మెల్యే సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి ఠాగూర్ బాలాజీ సింగ్, ఆర్డీవో జనార్దన్ రెడ్డి, డీఎస్పీ వెంకట్ రెడ్డి, తహసిల్దార్ ఇబ్రహీం, కమిషనర్ మహమూద్ షేక్, మున్సిపల్ వైస్ చైర్మన్ శాన్ వాజ్ ఖాన్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, కౌన్సిలర్లు, పట్టణ పుర ప్రముఖులు, మున్సిపల్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రబోయి

## ఇండ్లను పరిశీలించి.. లబ్ధిదారులతో ముచ్చటించి..

**పైలెట్ ప్రాజెక్టు గ్రామం పోతంపల్లి లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ విజయేందిర బోయి**

**104 ఇళ్లు మంజూరు కాగా 10 పూర్తి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని పోతంపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణ పురోగతి విషయాలు తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పోతంపల్లి గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేశారు. గ్రామంలో పూర్తయిన ఇళ్లను కలెక్టర్ సందర్శించి, లబ్ధిదారులు నిర్మాణానికి ఎంత వ్యయం చేశారు, బిల్లులు సమయానికి అందుతున్నాయా లేదా అనే విషయాలను ఆరా తీశారు. అలాగే ఇళ్ల ప్లింత్ ఏరియా ఎంత ఉంది, ఆమోదించిన నమూనాకు భిన్నంగా ఏవైనా మార్పులు జరిగాయా అనే వివరాలను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి మొత్తం 104 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. వాటిలో 10 ఇళ్లు పూర్తయ్యాయి అని తెలిపారు. 65 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా, మిగతావి మార్కింగ్ స్థాయిలో ఉన్నాయని తెలిపారు. కలెక్టర్ నక్క హనుమంతు, కుమ్మరి బాలరాజు, జక్కలగల చెన్నమ్మల ఇళ్లను సందర్శించి వారితో మాట్లాడారు. నిర్మాణానికి ఇప్పటివరకు ఎంత ఖర్చు అయ్యిందని, బిల్లులు సమయానికి వచ్చాయా అని అడిగారు. దీనికి ఒక లబ్ధిదారు మాట్లాడుతూ ఇప్పటివరకు సుమారు రూ.2 లక్షలు ఖర్చు అయ్యాయని తెలిపారు. గోడల - మిగతా4లో..



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

## నిందారోపణలు మానండి..ఎమ్మెల్యే గారు..

**కబ్జాలు చేసింది మేము కాదు మీరు**

**మీడియా సమావేశంలో రాజాపూర్ బీఆర్ఎస్ నాయకులు**

**రాజాపూర్, జనవరి 20 ప్రభాతవార్త :** జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, భూ కబ్జాలు చేసింది బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాదని, సర్వేనెంబర్ 268 లో ఉన్న కొత్త కుంటును ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కబ్జాచేసి విక్రయించుకున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులపై నిందారోపణలు మాని, ఎక్కడైనా కబ్జా చేసినట్లు ఉంటే ఆధారాలతో నిరూపించాలన్నారు. నాగుల కుంటలు రిటైర్డ్ ఆర్మీకి ఇచ్చారని, దీనికి భూ పట్టాదారులు ఎన్.ఓ.సి తెచ్చుకుని విక్రయించుకోవడం జరిగిందన్నారు. కేవలం ఒక ఎకరా భూమిని అన్ని పార్టీల నాయకులు కలిపి వెంచర్ చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ వెంచర్ లో ప్రభుత్వ కార్యాలయాల కోసం రెండు వేల గజాల స్థలం సిద్ధంగా ఉందని, వారం - మిగతా4లో..




మున్సిపల్ వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

## గృహప్రవేశంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**నవాబుపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కారూర్, కూచూరు గ్రామాల్లో జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కారూరు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు బండారి లలిత,సిద్దు ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పాల్గొని ప్రారంచారు. నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం పేదల గృహావసరాలను తీర్చేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి అర్హుడికి గౌరవప్రదమైన నివాసం కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. లబ్ధిదారు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం కూచూరు గ్రామ కాంగ్రెస్ నాయకులు బొంకూరు మల్లయ్య ఇంటి గృహప్రవేశానికి హాజరయ్యి కాంగ్రెస్ కార్యకర్తలను కలిసి కాసేపు ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో కారూరు గ్రామ సర్పంచ్ ఎర్రోళ్ల శంకర్ , ఎంపీడీఓ జయరాం నాయక్, హౌసింగ్ ఏ ఈ, కాంగ్రెస్ నాయకులు అనూక్, ఇప్పటూరు మాధవులు, గ్రామ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

## విద్యార్థులకు భోధనలో మెలకువలు

**కెటిదొడ్డి ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాతపాళెం గ్రామం "జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల"లో శుక్రవారంరోజు జరిగిన పాఠశాల సముదాయ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో "గెజిటెడ్ హెడ్మాస్టర్ "రాఘవేంద్ర మాట్లాడుతూ ...ప్రతి పాఠశాలలో "ఎఫ్ ఎల్ ఎస్" మూల దార విద్య అద్యయనము కార్యక్రమం ఖచ్చితంగా నిర్వహించాలని, ఆలాగే విద్యార్థుల సామర్థ్యాలు పెంపోదించాలని, మరియు ప్రతి రోజు మధ్యాహ్నం భోజనం కు సంబంధించిన సందేశం (మెసేజ్ ) ద్వారా పంపాలని, లేనిచో ఆన్లైన్ లో బిల్లు జనరేట్ కాదని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు కే సుమతి విద్యార్థులకు మాదిరి పాఠ్యాంశం బోధించడం జరిగింది. అధేవిధంగా ఎప్పటికప్పుడు పాఠశాల మధ్యాహ్న భోజన పథకం బిల్స్ పెండింగ్ లేకుండా ప్రతినెల 3 వ తేదీన లోపు మండల రిసోర్స్ పర్సన్స్ ల కు అందజేయాలని తెలిపారు. ఆలాగే హైస్కూల్ లో మధ్యాహ్నం భోజనం ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో "రిసోర్స్ పర్సన్స్" పరుశురాముడు , రాఘవేంద్ర,ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కే నరసింహులు , ఎస్సే రాణి, రేవతి, సి ఆర్ పి లు పాల్గొన్నారు.

## మహిళా సమైఖ్య భవనానికి భూమి పూజ

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** తెలంగాణ పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపిటిసి గోపి రెడ్డి రఘు పతి రెడ్డి సహకారంతో శుక్రవారం మండలంలోని పొలిటికల్ గ్రామంలో గ్రామ మహిళా సమైఖ్య భవనానికి భూమి పూజ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టబోయే గ్రామ మహిళా సమాఖ్య భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరిస్తామని గ్రామ సర్పంచ్ అర్కపల్లి జగతమ్మ దాసు పేర్కొన్నారు. ఈభూమి పూజ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఆర్కపల్లి జగతమ్మ దాసు,ఉప సర్పంచ్ గుడ్ల నర్వ హరీష్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపిరెడ్డి రమేష్ రెడ్డి, పార్టీ నాయకులు గోపిరెడ్డి వెంకటరెడ్డి, నీలం వెంకటయ్య, గుడ్ల నర్వ శ్రీశైలం, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



గ్రామ మహిళా సమైఖ్య భవనానికి భూమి పూజ

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

**సర్పంచ్ విజయలక్ష్మి వెంకట్ రాములు గౌడ్**

**కోయిలకొండ ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని సర్పంచ్ విజయలక్ష్మి వెంకట్ రాములు గౌడ్ తెలిపారు. శుక్రవారం కోయిలకొండ మండలం వీరం పల్లి గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాలను సర్పంచ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లను నారాయణ పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కుంభం శివ కుమార్ రెడ్డి సహకారముతో గ్రామానికి మరిన్ని ఇండ్లు వచ్చే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు చెన్నమ్మ, సునీత గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న దృశ్యం

## ప్రతిభకు పేదరికం అడ్డుకావద్దన్నదే తమ లక్ష్యం

**మెడిసిన్‌లో సీటు సాధించిన విద్యార్థికి ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే**

**దేవరకద్ర, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మెడిసిన్‌లో సీటు సాధించిన వైద్య, విద్యలో, అడుగుపెట్టిన విద్యార్థికి దేవరకద్ర ఎమ్మెల్యే ఆర్థిక సహాయం అందించారు. శుక్రవారం దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన ఉస్కిల్ల లక్ష్మమ్మ కుమారుడు వంశీ మెడిసిన్ లో సీటు సాధించిన సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తన సొంత నిధులతో రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డు కావద్దన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించేందుకు తమ వంతు సహాకారం ఎప్పటికి ఉంటుందని భరోసా ఇచ్చారు. వైద్య, విద్య, పూర్తి చేసి సమాజానికి సేవ చేసే మంచి వైద్యుడిగా ఎదగాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంత్ రెడ్డి, అంజన్ కుమార్ రెడ్డి, రామాంజనేయులు, ఫరూక్ అలీ,చంద్రమౌళి, గౌని రాము, బలిసిపల్లి శంకర్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి మెడిసిన్ చదువు కోసం ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## కౌన్సిలర్లను సన్మానించిన టౌన్ ప్రెసిడెంట్



నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లను సన్మానిస్తున్న దృశ్యం

**దేవరకద్ర,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టిన దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, కౌన్సిలర్లను టౌన్ ప్రెసిడెంట్, మైనార్టీ సోదరులు శాలువాతో ఘనంగా సన్మానించారు. దేవరకద్ర పట్టణ అభివృద్ధి ,ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేస్తారనే విశ్వాసం వ్యక్తం చేస్తూ,ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా టౌన్ ప్రెసిడెంట్ ఫరూక్ అలీ,మైనార్టీ నాయకులు, మాట్లాడుతూ మున్సిపల్ పాలనలో అన్ని వర్గాలకు సమాన న్యాయం చేస్తూ, ముందుకు సాగాలని కోరారు. ముఖ్యంగా పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సాధించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్మన్ ,వైస్ చైర్మన్లు, మాట్లాడుతూ తమపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. మైనార్టీ సోదరుల సహకారం ఎల్లప్పుడూ అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# గద్వాలను ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

**గద్వాల ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** గద్వాల మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మున్సిపాలిటీ గా తీర్చి దిద్దుతామని, భౌశ్యత్తులో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గద్వాల మున్సిపాలిటీ లో కొత్తగా ఎన్నికైన గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మీ ౖ నర్సింహులు యాదవ్ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ సమక్షంలో మున్సిపల్ చైర్ పర్సన్ గా తుమ్మల జయలక్ష్మి ౖ నరసింహులు యాదవ్ మొదటి సంతకం చేసి పదవికి బాధ్యతలు స్వీకరించారు. అలాగే వైస్ చైర్మన్ గా గంజిపేట శంకర్ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూగద్వాల పట్టణ ప్రజలు మీపై నమ్మకంతో మీకు ఓట్లు వేసి గెలిపించారని, ప్రజలు మీకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పట్టణ అభివృద్ధికి పాటు పడాలని అన్నారు. వివిధ వార్డులలో గెలుపొందిన కౌన్సిలర్లు అందరూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వార్డ్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి రాష్ట్ర మంత్రివర్యుల సహకారంతో ప్రత్యేక నిధులు తీసుకొచ్చి గద్వాల మున్సిపాలిటీనీ భవిష్యత్తులో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే విధంగా నా వంతు కృషి చేస్తానని తెలిపారు. చైర్ పర్సన్ జయలక్ష్మి ౖ మాట్లాడుతూ ......గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ గా నా పై నమ్మకం నుంచి నాకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కు, పట్టణ ప్రజలకు హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గద్వాల పట్టణ అభివృద్ధి లక్ష ౖయంగా పనిచేస్తూ గద్వాల పట్టణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారిశుద్ధ్య ,దీపాలు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేస్తామని, ప్రతి వార్డ్ పై ప్రత్యేక దృష్టి పెట్టి వార్డు అభివృద్ధితోపాటు గద్వాల పట్టణ అభివృద్ధికి నా వంతు సహాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, బక్క చంద్రన్న, సుభాన్, జమ్ములమ్మ చైర్మెన్ వెంకట్రాములు, తుమ్మల నరసింహులు, జమ్మిచేడ్ నాగరాజు, నూతన కౌన్సిలర్స్, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**చైర్ పర్సన్ పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే**



రిజిస్టర్ లో సంతకం చేసి పదవి బాధ్యతలు చేపడుతున్న చైర్ పర్సన్



చైర్మన్‌కు ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్

## ఆయిల్ ఫామ్ పంటల సాగుకు

## అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్న అధికారులు

**గద్వాల ఫిబ్రవరి 20, ప్రభాత వార్త:** జిల్లాలోని రైతులు ఆయిల్ పామ్ పంట సాగు చేసి ఆర్థికంగా ఎదగాలని, ఇందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు టీజీ ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి అన్నారు.శుక్రవారం ఎర్రవల్లి మండలం బీచుపల్లి వద్ద ఉన్న ఆయిల్ పామ్ మిల్లును జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్ తో కలిసి జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో సుమారు 7200 ఎకరాల విస్తీర్ణంలో 1751 మంది రైతులు ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్నారన్నారు. " మన ఊరు, మన ఆయిల్ పామ్, మన భవిష్యత్తు " నినాదంతో ఉద్యానవన, వ్యవసాయ శాఖల సహకారంతో జిల్లాలోని రైతులకు ఈ పంటపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు, విజ్ఞాన యాత్రలు నిర్వహిస్తున్నమన్నారు. ప్రస్తుతం ఒక టన్ను ఆయిల్ పామ్ ఖరీదు రూ. 20,456 ఉందని, ఈ ధర భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం నాలుగు సంవత్సరాల తోటలలో నుండి ఎకరాకు నాలుగు నుంచి ఐదు టన్నుల పంట దిగుబడి వస్తున్నందున రైతులు మంచి ఆదాయాన్ని పొందే అవకాశం ఉందన్నారు. తెలంగాణ ఆయిల్ ఫెడ్ సంస్థ రైతుల నుంచి పామ్ పంటను దళారుల బెడద లేకుండా నేరుగా బీచుపల్లి ఫ్యాక్టరీలో తీసుకుని రైతులకు రవాణా ఖర్చులు కూడా చెల్లిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని వెంకటాపురం స్టేజి దగ్గర, ధరూర్ లో పంటను నేరుగా సేకరించు కేంద్రాలను కూడా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో బీచుపల్లి వద్ద రూ. 47 కోట్ల వ్యయంతో కొత్త ఆయిల్ పామ్ మిల్లు ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ప్రభుత్వం నుంచి తీసుకోవడం జరిగిందని ఇందుకు సంబంధించిన సివిల్ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ పంట వేసేందుకు అవసరమైన ఎరువులు, డ్రిప్, హార్వెస్టింగ్ పనిముట్లు అందుబాటులోకి తీసుకొస్తున్నామని, రైతులకు అవగాహన కల్పించేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు ట్రైనింగ్ సెంటర్ భవన నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ పర్యటనలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్, ఆయిల్ ఫెడ్ అధికారి శివనాగిరెడ్డి, తదితరులున్నారు.



పంట వేసేందుకు రైతుల భూ పరిశీలన చేస్తున్న అధికారులు

## మత్స్యకారుల అభ్యున్నతికై ప్రభుత్వం కృషి

**పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజు గౌడ్**

**అమరచింత ఫిబ్రవరి 20, ప్రభాత వార్త:** ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతకై ఎనలేని కృషి చేస్తుందని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజు గౌడ్ అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత రొయ్యల చేప పిల్లలను వనపర్తి జిల్లా మత్స్యశాఖ అధికారి, లక్ష ౖమప్పతో కలిసి కేశం నాగరాజు గౌడ్ జూర్యాల బ్యాక్ వాటర్ లో 8 లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా కేశం నాగరాజు గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర మత్స్య శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి సహకారంతో మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని లక్ష ౖయంతో అమరచింత, ఆత్మకూర్, జూరాల ప్రాజెక్టులో లక్షలాది చేప పిల్లలను వదిలేయమని ఆయన చెప్పారు. అలాగే జూరాల ప్రాజెక్టు దగ్గర చేపల ఉత్పత్తి కేంద్రం తోపాటు ఫిషరీస్ కళాశాల ఏర్పాటు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం చేపల వంట కోసం ప్రత్యేక వాహనాలను మత్స్యకారులకు అందజేశామని ఆయన గుర్తు చేశారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అమరచింత మున్సిపల్ చైర్ పర్సన్, జింక సువర్ణ, వైస్ చైర్ పర్సన్, రాధమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, నందిమల్ల గ్రామ సర్పంచ్ రాజేందర్ రెడ్డి, మిట్ట నందిమల్ల సర్పంచ్ వడ్డె శ్రీనివాసులు, ఆత్మకూర్ మార్కెట్ డైరెక్టర్లు, శ్యాం కుమార్, కమలాకర్ గౌడ్, రవికాంత్, కౌన్సిలర్ లు వనిత, రాములు, మాధవి, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



జూరాల బ్యాక్ వాటర్ లో ఉచిత చేప పిల్లల పంపిణీ

## మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక: మున్సిపల్ చైర్మన్

**ఆత్మకూర్ ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణాన్ని అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిం చనున్నట్లుగా మున్సిపల్ చైర్పర్సన్ జి నాగమణి, వైస్ చైర్ పర్సన్ నల్లగొండ శ్రీనివాసులు తదితరులు వెల్లడించారు. శుక్రవారం రోజు మున్సిపల్ చైర్ పర్సన్ గా నాగమణి వైస్ చైర్పర్సన్ గా నల్లగొండ శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రపాడి పరిశ్రమ అభివృద్ధిశాఖ మంత్రివర్యులు మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ఆశీస్సులతో ఆత్మకూర్ పట్టణాన్ని అభివృద్ధి పరచేందుకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించామని అందులో భాగంగానే గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణానికి ప్రత్యేకంగా 15 కోట్ల నిధులు విడుదల చేయడం జరిగిందని వారు తెలిపారు.మంత్రి విడుదలచేసిన నిధులతో పట్టణం లోని ప్రతివార్డులో రాజకీయాల కతీతంగా అభివృద్ధి పనులు చేపట్టిన ట్లుగా వారు తెలిపారు. ప్రధానంగా పట్టణంలోని ప్రధాన రహదారులు మరియు సిసి రోడ్ల నిర్మాణాలు అంతర్గత మురుగు కాలువ నిర్మాణా లు చేపట్టేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లుగా వెల్లడించారు.రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు రానున్న వేసవికాలంలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికలతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లుగా వారు వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలోని 10 వార్డులలో గెలుపొందిన కౌన్సిలర్లు సైతం శుక్రవారం రోజు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా ఆత్మకూర్ మున్సిపాలిటీకి చేరుకుని చైర్మన్ మరియు వైస్ చైర్మన్ విజయం సాధించిన కౌన్సిలర్లను ప్రత్యేకంగా శాలువాలు పూలమాలతో ఘనంగా సత్కరించారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రాజకీయాలకతీతంగా తామందరం కలిసిమెలిసి పనిచేయడమే కాకుండా రాష్ట్ర మంత్రి వాకిడి శ్రీహరి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ పరువు నిలబెట్టేందుకు శక్తి వంచనలేకుండా కృషిచేస్తామని వారు తెలిపారు.ఈకార్యక్రమంలో ఆత్మకూర్ కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు పరమేష్ మక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు తులసిరాజు యాదవ్ పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లను ఘనంగా సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా

## మాతృభాషతో మూలాలు.. ఇంగ్లీష్‌తో అవకాశాలు

**నారాయణపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** నారాయణపేట విద్య ద్వారా సామాజిక న్యాయం సాధించాలంటే ప్రాథమిక స్థాయి నుంచే మాతృభాష తెలుగుతోపాటు ఇంగ్లీష్ భాషను కూడా బోధించాల్సిన అవసరం ఉందని ప్రముఖ ఇంగ్లీష్ శిక్షకులు ఏ.ఎస్.రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.మెర్సీ వసంత అధ్యక్షతన విద్యార్థుల కోసం ఇంగ్లీష్ భాషపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రపంచం గ్లోబలైజేషన్ వైపు దూసుకెళ్తోందని, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లీష్‌పై పట్టు సాధించాల్సిన అవసరం ఉందని సూచించారు. అమ్మ భాష మాతృభాష తెలుగు అయితే, నడిపించే నాన్న భాష ఇంగ్లీష్" అని వ్యాఖ్యానించారు. యువతలో ఆంగ్ల భాషా నైపుణ్యాల లోపం వారి పోటీ సామర్థ్యాన్ని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యువతలో భాషా నైపుణ్యాలను పెంపొందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని, అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని ఆయన సూచించారు. విద్యార్థులు ఆంగ్లంతో పాటు ఇతర విదేశీ భాషలపై కూడా పట్టు సాధిస్తే గ్లోబల్ స్థాయిలో అవకాశాలు విస్తరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జి. రంగారెడ్డి, ఏ.భాస్కర్ రెడ్డి, బి. కృష్ణారెడ్డి, డా. సిహెచ్. శంకర్, జి.శ్రీనివాస్, జైపాల్ రెడ్డి, కే. శ్రీనివాస్, ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ ఇంగ్లీష్ శిక్షకులు ఏ.ఎస్. రెడ్డి

## గురుకులాల్లో ప్రవేశాల కోసం పరీక్ష

**గద్వాల ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఫిబ్రవరి 22న గురుకుల ప్రవేశ పరీక్ష 2026-2027 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలతో పాటు 6వ తరగతి నుండి 9వ తరగతివరకు ఉన్న బ్యాక్లాగ్ సీట్ల భర్తీకి ఈ నెల 22న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తునట్లు జిల్లా సమన్వయకర్త శోభారాణి, జిల్లా రూట్ అధికారి కె. రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ నుండి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, మొత్తం 6,284 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు ఈ ప్రకటన ద్వారా తెలిపారు.

## యంనోనిపల్లి గ్రామంలో

## విద్యుత్ లైన్ పునర్నిర్మాణానికి శ్రీకారం

**25 పోల్స్‌తో గ్రామం మొత్తం వెలుగులు**

**ధన్వాడ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని యంనోనిపల్లి గ్రామంలో 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పాత విద్యుత్ లైన్‌ను పూర్తిగా తొలగించి, కొత్తగా పునర్నిర్మాణం చేసే పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామాన్ని సంపూర్ణంగా విద్యుత్ కాంతులతో వెలిగించాలనే లక్ష్యంతో 25 కొత్త విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బోయ నాగేశ్వర్ ముందడుగు వేయగా, ధన్వాడ మండల ప్రెసిడెంట్ నరహరి సహకారం అందిస్తు న్నారు. యంనోనిపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని గ్రామ పాలకవర్గం కృతనిశ్చయంతో ముందుకు సాగుతోంది.ఈ అభివృద్ధి కార్యక్రమానికి నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపించి సహకారం అందించారు. గ్రామం మొత్తం విద్యుత్ కాంతులతో వెలిగేలా చేయాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే చర్యలు తీసుకోవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యుత్ లైన్ పనులు చేపట్టిన అధికారులు

## బస్సు సౌకర్యం కల్పించాలి

**ఆర్టీసీ డీఎంకు బీజేపీ వినతిపత్రం**



ఆర్టీసి డీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట, ఫిబ్రవరి 20ప్రభాతవార్త:** నారాయణపేటజిల్లా ఉట్కూరు మండల పరిధిలోని పెద్దపొర్ల గ్రామానికి తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం నారాయణపేట డిపో మేనేజర్ లావణ్యకు వినతిపత్రం సమర్పించారు. పెద్దపొర్ల గ్రామం నుంచి ప్రతిరోజు సుమారు 70 నుంచి 80 మంది విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం కోసం అలాగే గ్రామస్తులు వివిధ పనుల నిమిత్తం నారాయణపేట మక్తల్ పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అయితే గ్రామానికి ఇప్పటివరకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఉదయం, సాయంత్రం దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర కాలినడకన కొల్లూరు గేటు వరకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెద్దపొర్ల గ్రామానికి తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని డీఎం లావణ్య హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోయిన్‌పల్లి నరేష్ కుమార్, బి.వెంకటయ్య, సంటి రాము, నాగేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీని పరామర్శించిన

## మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

**బిజినేపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాద సంఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని,విశ్రాంతి తీసుకొని తిరిగి ఆరోగ్యంగా ముందుకు సాగాలని కోరారు. వెలుగొండ గ్రామంలో పిఎసిఎస్ డైరెక్టర్ రామ్ రెడ్డి తండ్రి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని మర్రి జనార్దన్ రెడ్డి పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు పులేందర్ రెడ్డి, రైతు సమితి మాజీ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు వెంకటయ్య, యాదవ రెడ్డి, తిరుపతి రెడ్డి, ఖదీర్, సుదర్శన్ రెడ్డి, బాలస్వామి తదితరులు ఉన్నారు.

## టీఎస్‌సీపీఎస్‌ఈయు క్యాలెండర్ ఆవిష్కరణ



**దేవరకద్ర,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో టీఎస్ సిపిఎస్ఇయు క్యాలెండర్ ను మండల విద్యాధికారి మంజులత చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఉద్దేశించి జిల్లా బాడీ ధనుంజయ్ మాట్లాడుతూ డిఏ అరియర్స్ సకాలంలో జమ చేయక పోవడం వలన భవిష్యత్తులో పెన్షన్ లెక్కింపులో ఉద్యోగులకు కలిగే నష్టాలను వివరించారు. అలాగే మార్చింగ్ గ్రాండ్ ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాల్సిందిగా మండల విద్యాధికారి ద్వారా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయడం జరిగింది. అదేవిధంగా ప్రధాన కార్యదర్శి బుచ్చన్న మాట్లాడుతూ ప్రభుత్వమిచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ ను రద్దు చేస్తూ, పాత పద్ధతి ప్రకారం పునరుద్ధరించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు నాగమణి ప్రధాన కార్యదర్శి బుచ్చన్న,మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, జిపిఓలు, తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది, ఉపాధ్యాయ బృందం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన నూతన కార్యవర్గం



మంత్రిని కలిసి మొక్కను అందజేస్తున్న జిల్లా టీఎన్జీఓ యూనియన్ నూతన కార్యవర్గ సభ్యులు

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా టీఎన్జీఓ యూనియన్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా టీఎన్జీఓ యూనియన్ అధ్యక్షులు నరసింహారెడ్డి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నూతన కార్యవర్గ సభ్యులందరినీ శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని అంశాలను ప్రస్తావిస్తూ జిల్లాలో మొదటిసారిగా టీఎన్జీఓ యూనియన్ ఏర్పాటు కావడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో టీఎన్జీఓ సంఘ భవనాన్ని ఏర్పాటు చేయడానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాలమూరు జిల్లా అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, కార్యదర్శి చంద్రునాయక్, కృష్ణ మోహన్ జిల్లా సెక్రెటరీ దామోదర్, నూతనంగా ఎన్నికైన సభ్యులు, బాలరాజు, సిద్ధిరామరెడ్డి, శివకుమార్, సుజాత, మునవర్అలీ, శ్రీధర్, మునియప్ప పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పపెట్రీ పోటీలలో పేట ఉపాధ్యాయుల విజయం



**నారాయణపేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పపెట్రీ షో పోటీలలో నారాయణపేట జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు ప్రథమ బహుమతి సాధించారు. తెలంగాణ రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణమండలి ఆధ్వర్యంలో యువతలో లింగ సమానత్వ అవగాహన" అంశంపై ఈ పోటీలు నిర్వహించబడ్డాయి. బాలురు-బాలికలు సమానమే, సమాన హక్కులు, బాధ్యతలు కలవారనే సందేశాన్ని పపెట్రీ రూపంలో సృజనాత్మకంగా ప్రదర్శించడం ప్రధాన లక్ష్యంగా నిలిచింది. నారాయణపేట జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన అంబిక (ఎంపీపీఎస్ కేడబ్ల్యూ ధన్వాడ) మరియు శ్వేత (ఎంపీపీఎస్ కంసానపల్లి) రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ప్రతి జిల్లాకు ఒక ఉపాధ్యాయ బృందానికి మాత్రమే అవకాశం కల్పించగా, గరిష్టంగా 2-3 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల ఎస్‌జీటీ/ఎస్ఏ ఉపాధ్యాయులు అర్హులుగా ఎంపికయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు ఈ విజయంపై అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయుల సృజనాత్మకత, సామాజిక అవగాహన పెంపొందించే కృషి ప్రశంసనీయం అన్నారు. పపెట్రీ కళకు సంబంధించిన శిక్షణను సాంస్కృతిక వనరులు, శిక్షణ కేంద్రం ద్వారా అందిస్తున్నందుకు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు.

## దక్షిణ కాశీలో పూజలు నిర్వహించిన తహసీల్దార్



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**వెల్దండ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** దక్షిణ కాశీలో విరజిలుతున్న గుండాల అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో తహసిల్దార్ కార్తీక్ కుమార్ జ్యోతి దంపతులతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. తహసిల్దార్ దంపతులను ఆలయ అర్చకులు శాలువాలతో ఘనంగా సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. తహసిల్దార్ మాట్లాడుతూ జరుగనున్న బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండాచూడాలని ఆలయ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కమిటీసభ్యులు అంజయ్య, ఆలయఅర్చకులు శివప్రసాద్ శర్మ, సంతోష్‌శర్మ, నరహరి శర్మ, కృష్ణయ్యశర్మ, సురేష్ శర్మ, దేవాలయ సిబ్బంది కిషన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## 16వ వార్డు స్థానిక షరీఫా మసీదులో ఘనంగా ఇఫ్తార్ విందు

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మక్తల్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అలుకూరి రవికుమార్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని మైనార్టీ సోదరులకు మక్తల్ పట్టణంలోని షరీఫా మసీదులో ఇఫ్తార్ విందుఅందించారు. సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ఉపవాస దీక్ష ముగించగా, అనంతరం రవికుమార్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. దాదాపు 15 నుంచి 20 సంవత్సరాల నుంచి ప్రతి ఏటా రవికుమార్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును అందిస్తున్నారని ఈ సందర్భంగా ఆయనకు మసీదు కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మత సామరస్యానికి పెట్టింది పేరని, అన్ని మతాలను సమానంగా చూస్తామని, అన్ని మతాలకు పెద్దపీట వేస్తామని తెలిపారు. పవిత్రరంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లిం సోదర సోదరీమణులకు ఉద్యోగ వేళల్లో సీఎం రేవంత్ రెడ్డి వెసులుబాటు సైతం కల్పించారని గుర్తు చేశారు. అనంతరం ముస్లిం సోదరులందరికీ రంజాన్ మాసం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మారెడ్డి, వాకిటి హన్మంతు, కట్టా సురేష్‌గుప్తా, కోళ్లవెంకటేష్, చంద్రకాంత్ గౌడ్, వార్డు కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు

# మున్సిపాలిటీల రూపురేఖలు మారుస్తాం

■ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్ దమయంతి గోవర్ధన్‌రెడ్డి



చైర్మన్, వైస్ చైర్మన్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**దేవరకద్ర,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని, దేవరకద్ర నూతన మున్సిపాలిటీ కేంద్రాన్ని మరో ఆరు నెలల్లో రూపురేఖలను మారుస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. దేవరకద్ర నూతన మున్సిపాలిటీ కేంద్రంలోని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్లు పదవీ బాధ్యతలను చేపట్టారు. శుక్రవారం దేవరకద్ర మున్సిపాలిటీ కార్యాలయంలో నూతనంగా గెలిచిన చైర్మన్ దమయంతి గోవర్ధన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ యుగేందర్ రెడ్డి, ఆయా అవార్డుల కౌన్సిలర్లు ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, పదవి బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్ల పదవి బాధ్యతల స్వీకార కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పరిశుభ్రత, తాగునీరు, డ్రైనేజీ, రహదారుల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా ఆధునిక మౌలిక అవసరాలతో పాటు, మున్సిపాలిటీల రూపు రేఖలు పూర్తిగా మారుస్తామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, పారదర్శకతతో పనులు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గత ప్రభుత్వాలు పట్టణాలను రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించుకున్నాయని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ప్రజల అవసరాలే కేంద్ర బిందువుగా పనిచేస్తుందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు, లక్ష్మీకాంత్‌రెడ్డి, కొండ శ్రీనివాస్‌రెడ్డి, ఈవోసీతానాయక్, ఫరూఖ్ అలీ, ఇనాయత్‌అలీ, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను నిజం చేస్తాం

● నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి



ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**బిజినేపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరు సొంతింటిని కలిగి ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల అని ఎమ్మెల్యే కూచుకున్న రాజేష్ రెడ్డి అన్నారు. గంగారం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటిని పూర్తి చేసుకుని గృహప్రవేశం చేయడం ఎంతో సంతోషాన్ని కలిగించింది అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రోడ్లు, నీటి సదుపాయం, విద్యుత్ వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉప్పనమోని లక్ష్మమ్మ, పానుగంటి మాధవి, మిద్దె రాములు గంగనమోని తిరుపతయ్య, అమృత్ రెడ్డి, హరీష్‌రెడ్డి ,రాజవర్ధన్‌రెడ్డి, వీరేష్ హర్యా దీప్లా శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను మోసం చేస్తున్న కవిత

- తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డా. పిడమర్తి రవి
- తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులుగా ఉల్లంకొండ రాములు నియామకం



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారులను గత ప్రభుత్వంలో పట్టించుకోలేదని ఉద్యమకారులను తీవ్రంగా అణిచివేశారని కనీసం ఉద్యమకారులకు గుర్తింపు లేకుండా కేసీఆర్ పాలన కొనసాగిందని ఇప్పుడు కూడా కల్వకుంట్ల కవిత ఉద్యమకారులను మోసం చేస్తున్నారని తెలంగాణ ఉద్యమకారులసంఘం వ్యవస్థాపకులు డా. పిడమర్తి రవి అన్నారు. తెలంగాణ ఉద్యమకారులు ఎవరు కవిత ట్రాప్‌లో పడొద్దని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ పట్టణ కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి పిడమర్తిరవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎండి రహీం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 250గజాలఇంటి స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమకారులను కల్వకుంట్ల కుటుంబం మోసం చేస్తుందని వారివలలో తెలంగాణ ఉద్యమకారులు పడొద్దని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులుగా ఉల్లెం కొండ రాములును నియమించారు. ఉద్యమ కారులు చోట మోనిరాము, అన్వర్ పాషా, సుజాత, బోరెల్లి సురేష్, మీసాల మహేష్, మెట్టు కాడి ప్రభాకర్, కర్ణాకర్ అర్జున్, బుర్ర నరేష్ పాల్గొన్నారు.

# మక్తల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉంటాం

- బాధ్యతలు స్వీకరించిన మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు
- హాజరైన మంత్రి వాకిటి శ్రీహరి



బాధ్యతలు స్వీకరించిన చైర్మన్, వైస్ చైర్మన్

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మక్తల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని, స్థానిక మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి అండదండలతో మునిసిపాలిటీని అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు తెలిపారు. మున్సిపాలిటీలోని చైర్మన్ చాంబర్లో శుక్రవారం ఉదయం పురోహితుల సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో మున్సిపల్ చైర్ పర్సన్‌గా వాకిటి మానస హనుమంతు బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్ పర్సన్ శైవిరెడ్డి సైతం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు మాట్లాడుతూ నియోజక వర్గంలో మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, మంత్రి చేపట్టిన అభివృద్ధిని చూసి మక్తల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి అఖండ మెజారిటీ అందించారని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి సూచనల మేరకు మక్తల్ మున్సిపాలిటీకిఅధిక నిధులను తీసుకువచ్చి, మంత్రి వాకిటి శ్రీహరిమార్గదర్శకత్వంలో మక్తల్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే అత్యున్నత స్థాయిలో నిలబెట్టేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, పురపాలక సిబ్బంది అందరి సహకారాలతో అభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత, మార్కెట్ చైర్ పర్సన్ రాధా లక్ష్మారెడ్డి, అన్నివార్డుల కౌన్సిలర్లు, చంద్రకాంత్ గౌడ్ గణేష్ కుమార్, రవికుమార్, కల్లూరి గోవర్ధన్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వాహన చోదకులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

● ఎస్సై వెంకట్ రెడ్డి, సర్పంచు శ్రీలత విజేందర్‌రెడ్డి



**ఉప్పునుంతల, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** వాహన చోదకులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, దీంతో ప్రమాదాలను నివారించవచ్చని ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డి, పెనిమిళ్ళ గ్రామ సర్పంచ్ మెడసాని శ్రీలత విజేందర్ రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని పెనిమిళ్ళ గ్రామ పంచాయతీ ఆవరణలో ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రాణాలు విలువైనవని, తాము వాహనాలు నడిపే ముందు మన కుటుంబ సభ్యులను తలుచుకుంటూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కోరారు. అదేవిధంగా అతిగా మద్యం సేవించి రహదారులపై వాహనాలు నడపడం సరికాదని, పోలీస్ శాఖ ప్రకటిస్తున్న నిబంధనలను పాటించాలని ఆయన కోరారు. గ్రామంలో కొంతమందికి ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకట్‌రెడ్డి, గ్రామసర్పంచ్ మేడసాని శ్రీలత విజేందర్‌రెడ్డి, ఏఎస్ఐ రెడ్యానాయక్, హెడ్ కానిస్టేబుల్‌జాకీర్, గ్రామపెద్దలు సామాజిక సేవ కార్యకర్త విజయపాల్ రెడ్డి, మెడ సాని విజేందర్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి భాస్కర్, వార్డు సభ్యులు ఉషన్న, నాగరాజు, యాదమ్మ ఆంజనేయులు, సావిత్రి మహేష్, అజ్జు, మారంరవి, బెక్కం సుధాకర్, గ్రామయువకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ తిరుపతయ్య

**దామరగిద్ద, ఫిబ్రవరి20 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తహసిల్దార్ తిరుపతయ్య సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి బాలాజీప్రసాద్ సమక్షంలో ఏఈవోలు, జీపిఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు విధిగా ఫార్మర్ ఐడి కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు, సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలు సులభంగా పొందవచ్చని వివరించారు. అందువల్ల రైతులందరికీ అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈనెల 21 నుంచి 28 వరకు కేటాయించిన షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్య క్రమాన్ని పూర్తిచేయాలని స్పష్టం చేశారు.

## నేడు పేరెంట్స్ మీటింగ్

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** జిల్లాలోని సర్కారు బడులన్నింటిలో ఈ నెల 21న పేరెంట్ టీచర్ మీటింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. ప్రవీణ్ కుమార్ ఆదేశించారని సీఎంఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. గవర్నమెంట్, లోకల్ బాడీ, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల లో ఈ మీటింగ్ పెట్టాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులకు డీఈఓ ఆదేశాలిచ్చారు. పరీక్షల టైం దగ్గర పడుతుండటంతో పిల్లలకు ఇంట్లో ఎలాంటి సపోర్ట్ ఇవ్వాలనే దానిపై పేరెంట్స్ లో అవగాహన కల్పించాలని సూచించారు. మీటింగ్‌కు రాని పేరెంట్స్‌ను గుర్తించి రప్పించాలన్నారు. ప్రత్యేకంగా 10వ తరగతి విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులు ఏ రకంగా విద్యార్థులను సిద్ధం చేయాలో తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. మూడో తరగతి విద్యార్థులకు ఎఫ్‌ఎల్ఎస్ పరీక్ష సన్నద్ధతకు అలాగే రెండో తరగతి విద్యార్థులకు ఎఫ్‌ఎల్ఎన్ పరీక్షకు పూర్తిస్థాయిలో సిద్ధం చేయడానికి తల్లిదండ్రుల సహకారం తీసుకోవాలని తెలిపారు.

## శ్రీవెంకటేశ్వర స్వామి పునః ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనండి



తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి.ర్ నాయుడుకి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** వంగూరు మండల పరిది లోని ఎల్లమ్మ రంగాపూర్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ పునఃప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనాలని శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి.ర్ నాయుడుకి వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన కొమ్ముగోని శ్రీనివాస్‌గౌడ్, ఎల్లమ్మరంగాపూర్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయ గౌరవ అధ్యక్షులు గున్న సంజీవరెడ్డి, దేవాలయ చైర్మన్ రాజిరెడ్డిలు ఆహ్వాన పత్రికను అందించారు. హైదరాబాదు నగరంలోని బి.ఆం కార్యాలయంలో కలిసిఆహ్వాన పత్రికలను అందించారు. అదేవిధంగా తిరుమలతిరుపతి దేవస్థాన బోర్డు సభ్యులు, నాట్కో ఫార్మాచైర్మన్ సదాశివరావుకు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా ఎల్లమ్మరంగాపూర్ శ్రీవెంకటేశ్వర దేవాలయానికి సుమారు తిరుమల తిరుపతి శ్రీవారిలడ్డును చైర్మన్ అందిం చారు. స్వామివారి ప్రవచనాలకు సంబంధించి రూపొందించిన 2000 విష్ణు శాస్త్ర నామాల పుస్తకాలను దేవాదాయ కమిటీకి అందించారు.

## కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్‌కు శుభాకాంక్షలు



మున్సిపల్ చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బృంగి రత్నమాల ఆనంద్ కుమార్‌ను శుక్రవారం వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన కొమ్ముగోని శ్రీనివాస్ గౌడ్, జంగారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించిశాలువాలతో సన్మానించి శుభాకాంక్షలుతెలిపారు. అనంతరం తిరుమల తిరుపతి శ్రీవారిలడ్డు ప్రసాదాలను అందించారు.

## సిఐకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



సిఐకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ టౌన్ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని మహబూబ్‌నగర్ ఒకటవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సి.ఐ.) అప్పయ్య తన జన్మదినోత్సవం పురస్కరించుకొని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగాసిఐ అంపయ్యకు ఎమ్మెల్యే హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలకు న్యాయం భద్రత కల్పించడంలో సమర్థవంతంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో నిబద్ధతతో ముందుకు సాగాలని ఆశీర్వదిస్తూ, ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు కలగాలని అభిలషించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్ పాల్గొన్నారు.

## మహిళా సమైక్య ఆధ్వర్యంలో సన్మానం



బ్యాంక్ అధికారిని సన్మానిస్తున్న మహిళా సమైక్య సభ్యులు

**బిజినేపల్లి, ఫిబ్రవరి20 ప్రభాతవార్త:** ఎస్బిఐ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఫరూక్ భాషాను మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. గత మూడు సంవత్సరాలుగా బ్యాంకుపరిధిలోని మహిళా సంఘాలకు విశేషమైనటువంటి సేవలు అందించినందుకుగాను శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్, బ్యాంకు సిబ్బంది వివోఏలురాము, రాజు, ఎల్లస్వామి, ఆంజనేయులు, బేగం, సీసీ శంకర్, సీసీ లక్ష్మణ్, సీసీ కళావతి, సిసి రాము పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో భూలక్ష్మమ్మ బోనాలు

**రాజాపూర్, ఫిబ్రవరి20 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల పరిధిలోని గుండ్ల పొట్లపల్లి గ్రామంలో శుక్రవారం భూ లక్ష్మమ్మ అమ్మవారి బోనాలు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ బోనాల ఉత్సవాలకు గ్రామ సర్పంచ్ మాసయ్య భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చిన్నా, పెద్ద అనే తారతమ్యం లేకుండా మహిళలు నెత్తిన బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించి తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ బోనాలఉత్సవాల్లో పలుపార్టీలనాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న ఎస్సై నరేష్



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి



గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్ఐ నరేష్

**వనపర్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా నర్సింగాయపల్లి డిగ్రీ కళాశాల సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం ఒక్కసారిగా ఉద్రిక్తత సృష్టించింది. రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఈ ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడి రోడ్డుపైనే ప్రాణాల కోసం పోరాడుతున్న పరిస్థితి నెలకొంది. అదే సమయంలో గోపాల్‌పేట నుండి వనపర్తికి బైకుపై వస్తున్న జిల్లా పోలీస్ కార్యాలయంలో పని చేస్తున్న ఎస్సై నరేష్ ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించారు. అంబులెన్స్ తక్షణం అందుబాటులో లేకపోవడంతో ఆలస్యం ప్రాణాంతకమవుతుందని గ్రహించిన ఆయన, ఎలాంటి సందేహం లేకుండా గాయపడిన బాధితుడిని తన బైక్‌పై స్వయంగా వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై నరేష్ చూపిన ఈ వేగవంతమైన మానవీయ స్పందన అక్కడ ఉన్న ప్రజలను కదిలించింది. ప్రాణాలను కాపాడేందుకు తీసుకున్న ఆక్షణిక నిర్ణయంపై స్థానికులుశభాష్ పోలీస్" అంటూ ప్రశంసలు కురిపించారు. ఈ ఘటన పోలీసు సేవల్లో మానవత్వం ఎంత గొప్పదో మరోసారి చాటిచెప్పింది.

## ఇండ్లను పరిశీలించి.. లబ్ధిదారులతో ముచ్చటించి..



నూతన గృహప్రవేశం చేసుకున్న లబ్ధిదారులతో కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణానికి సంబంధించిన బిల్లు అందిందని, అయితే స్లాబ్ బిల్లు ఇంకా పెండింగ్‌లో ఉందని చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్ హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేయగా, కలెక్టర్ కూడా పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే బిల్లులు పెండింగ్‌లో ఉండకుండా సమయానికి విడుదల చేసి, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకట్ ఉపేందర్ రెడ్డి, డీఈ విజయ్ కుమార్, ఏఈ ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ధైర్యంగా ఉండాలి

**చిట్టిబోయినపల్లి ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం**



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ఎలాంటి సమస్య వచ్చిన ధైర్యంగా ఉండి తోటి మిత్రులతో కలిసి షేర్ చేసుకోవాలని ధైర్యంగా ఉండాలని మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ విద్యార్థినులకు సూచించారు. చిట్టిబోయినపల్లి ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేసారు. వంటశాలను పరిశీలించి కూరగాయల నాణ్యత పరిశుభ్రతపై పలు సూచనలు అందించారు. అనంతరం విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు. అలాగే ఎస్ఎస్సి విద్యార్థినులతో పరీక్షలు ఏ విధంగా రాయాలో మెలకువలు చెప్పారు. చదువుతున్న సమయంలో సబ్జెక్టులో ప్రాబ్లమ్స్ వస్తే తమ తోటి విద్యార్థినులు గ్రూప్ డిస్కస్ చేసుకోవాలని సూచించారు. అలాగే నిత్యం జీవితంలో సమస్యలు ఏ విధంగా ఎదుర్కోవాలో ధైర్యం చెప్పారు.

## మక్తల్ మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వాకిటి మానస హనుమంతు

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మక్తల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని, స్థానిక మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి అండదండలతో మునిసిపాలిటీని అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటిమానస హనుమంతు తెలిపారు. మున్సిపాలిటీలోని చైర్మన్ చాంబర్లో శుక్రవారం ఉదయం పురోహితుల సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో మున్సిపల్ చైర్ పర్సన్‌గా వాకిటి మానస హనుమంతు బాధ్యతలు స్వీకరించారు. వైస్‌చైర్ పర్సన్ శైవిరెడ్డి సైతం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో అనేక అభివృద్ధికార్యక్రమాలు జరుగుతున్నాయని, మంత్రి చేపట్టిన అభివృద్ధిని చూసి మక్తల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి అఖండ మెజారిటీ అందించారని అన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్లు, అధి కారులు, పురపాలక సిబ్బంది అందరి సహకారాలతో అభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత, మార్కెట్ చైర్ పర్సన్ రాధా లక్ష్మారెడ్డి, అన్నివార్డుల కౌన్సిలర్లు, చంద్రకాంత్‌గౌడ్ గణేష్ కుమార్, రవికుమార్, కల్లూరి గోవర్ధన్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ కాశీలో ప్రత్యేక పూజలు

**వెల్దండ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** దక్షిణ కాశీలో విరజిలుతున్న గుండాల అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో తహసిల్దార్ కార్తీక్ కుమార్ జ్యోతి దంపతులతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. తహసిల్దార్ దంపతులను ఆలయ అర్చకులు శాలువాలతో ఘనంగా సన్మానించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. తహసిల్దార్ మాట్లాడుతూ జరుగనున్నబ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండాచూడాలని ఆలయ అధికారులకు సూచించారు. కార్య క్రమంలో కమిటీసభ్యులు అంజయ్య, ఆలయఅర్చకులు శివప్రసాద్ శర్మ, సంతోష్‌శర్మ, నరహరి శర్మ, కృష్ణయ్యశర్మ, సురేష్ శర్మ, దేవాలయ సిబ్బంది కిషన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# సేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గంలో నడవాలి

**■ మంత్రి వాకిటి శ్రీహరి**

**నారాయణపేట, ఫిబ్రవరి20 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలం తిమ్మారెడ్డిపల్లి తాండాలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సేవాలాల్ మహారాజ్ చూపించిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమ, పశుసంవర్ధక శాఖ మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బంజారా ప్రజలకు సేవాలాల్ జయంతి శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి, బంజారా సమాజ అభివృద్ధికి సేవాలాల్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. గిరిజనులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బంజారాల సంక్షేమం కోసం ఆలోచించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. సేవాలాల్ చూపిన మార్గంలోనే సమాజం ముందుకు సాగాలని, తండాల్లో నివసించే ప్రతి కుటుంబం తమ పిల్లలను చదివించుకోవడం బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. చదువు ఎవరి సొత్తు కాదని, పిల్లలు విద్యాభ్యాసం చేస్తేనే బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, ఊరికి మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులకు మంత్రి సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం తండా వాసులతో కలిసి మంత్రి వాకిటి శ్రీహరి, కలెక్టర్ సిక్త పట్నాయక్, ఎస్పీ వినీత్, కాంగ్రెస్ ఆర్డీవో రామచంద్ర నాయక్, తహసిల్దార్ చింతా రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విఘ్నేశ్వర్ రెడ్డి, సర్పంచ్ మోహన్ నాయక్, మాజీ జడ్పీటీసి సూర్యప్రకాశ్ రెడ్డి, లంబాడా సాంప్రదాయ నృత్యంలో పాల్గొని సందడి చేశారు.



సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి, కలెక్టర్



గిరిజన సంప్రదాయంలో మంత్రి

# ఇతర పార్టీలకు అమ్ముడుపోయిన నీచమైన చరిత్ర నీది

- కాంగ్రెస్ పార్టీలో ఉన్న చీడపురుగులను ఏరిపారేయాలి
- ఆర్యవైశ్య మహిళలపై అవాక్కులు, చవాకులు కుస్తే ఊరుకోం..!
- 38 ఏళ్ల సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్‌లో పనిచేస్తున్న... ఏ ఒక్కరోజు పార్టీలైన్ తప్పలేదు
- రాష్ట్రంలోనే 2014లో ఎక్కడ టిడిపి పార్టీకి మున్సిపల్ పీఠం దక్కలేదు
- రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజిత



సమావేశంలో మాట్లాడుతున్న కల్వ సుజాత

**వనపర్తి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీలో ఉంటూ.. కాంగ్రెస్ పార్టీనీ అబాసు పాలు చేస్తూ, పార్టీకి విరుద్ధంగా పనిచేసే చీడపురుగులను పార్టీ నుంచి బహిష్కరించాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంలోకి అరుదుగా వస్తారని, జనరల్ స్థానాల్లో ఆర్యవైశ్య మహిళ మున్సిపాలిటీ చైర్మన్ పదవి వస్తే వక్రబుద్ధి ఉన్న కొందరికి గిట్టకపోవడంతో రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఆర్యవైశ్యులు ఎవ్వరి జోలికి వెళ్లరు ఎవరిని దూషించరు. సామాజికంగా ఆర్థికంగా తోడ్పాటు ఉంటూ ఎవరికైనా అండగా నిలబడతారన్నారు. ఆకలిగా ఉన్న వాళ్లకు అన్నం పెడతాం ఆర్యవైశ్య జోలికొస్తే సున్నం పెడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీలో చందర్ లాంటి దుర్మార్గులు ఉండడం వల్ల కాంగ్రెస్ పార్టీ అప్రతిష్ట పాలవుతుందన్నారు. సగర సంగం రాష్ట్ర అధ్యక్షులు శేఖర్, చీర్ల చందర్ బేషరతుగా ఆర్యవైశ్య సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చందర్ కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడు నిబద్ధతగా పనిచేసే పనుల కన్నా అబాసు పాలు తెచ్చే ప్రయత్నాలు చేసారని ఆరోపించారు. చందర్ ఆర్యవైశ్య మహిళపై, ఆర్యవైశ్యులు చేస్తున్న వ్యాపారాలపై అవహేళన చేస్తున్న తీరుపై టీపీసీసీ అధ్యక్షులకు ఫిర్యాదు చేస్తానన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డిలు చందర్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు శ్యాంసుందర్, చందర్, కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్య, శ్రీనివాస్ గౌడ్, జానకి రాములు, ఆర్యవైశ్య సంఘం మహిళలు, పలువురు ఉన్నారు.

# నిందారోపణలు మానండి.. ఎమ్మెల్యే గారు..

(మొదటి పేజీ తరువాయి)

రోజులు సమయం కాదు అంతకన్నా ముందే తాము రిజిస్ట్రేషన్ చేయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు మండల కేంద్రంలోనే ఉండాలని, ప్రస్తుతం ఉన్న స్థలానికి ఆనుకొని పరమేశ్వర్ రెడ్డి అనే వ్యక్తి కొంత స్థలాన్ని డొనేట్ చేస్తానని చెప్పడం జరిగిందని, కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ డోనర్ కు ఫోన్ చేసి బెదిరించినట్లు తెలిసిందన్నారు. డోనర్ కు రిక్వెస్ట్ చేసి స్థలం తీసుకునేలా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాన్ని ఒకే చోట రాజాపూర్ మండల కేంద్రంలో నిర్మించుకునేందుకు తాము కూడా సహకరిస్తామని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రంగారెడ్డి గూడ సమీపంలో ఉన్న ఐరన్ పరిశ్రమను ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఎందుకు మూయించలేకపోతున్నారో చెప్పాలన్నారు. అనంతరం రెవెన్యూ వెంచర్ లో ఉన్న 2000 గజాల స్థలాన్ని చూయించారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాజాపూర్ మండల అధ్యక్షులు మేకల శ్రీశైలం యాదవ్, మాజీ జడ్పీటిసి సభ్యులు మోహన్ నాయక్, మాజీ ఎంపీపీలు అన్మగల్ల నర్సింలు, సుశీల రమేష్ నాయక్, మాజీ సర్పంచ్ కప్పెరి బచ్చిరెడ్డిలు మాట్లాడారు.



ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

# అట్టహాసంగా సీఎం కప్ కబడ్డీ పోటీలు

(మొదటి పేజీ తరువాయి)

కోర్టులు ఇండోర్ స్టేడియం, క్రికెట్ మైదానం ఉంటుందని, అతి త్వరలో పనులు ప్రారంభించి సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. నారాయణపేట జిల్లా కేంద్రానికి కిసైతం మినీ స్టేడియం కోసం రూ.25 కోట్లు కేటాయించామని కలెక్టర్‌కు తెలిపారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే 33జిల్లాల జట్లకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, క్రీడా జెండాను ఎగురవేసి క్రీడాజ్యోతి వెలిగించారు. చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. పోటీల్లో భాగంగా నల్గొండ నిర్మల్ జట్ల మధ్య తొలి మ్యాచ్ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వర్ల విజయ్ కుమార్, జిల్లా క్రీడా యువజన శాఖ అధికారి వెంకటేష్ శెట్టి, మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, వైస్‌చైర్ పర్సన్ శైవిరెడ్డి, మార్కెట్ చైర్ పర్సన్ రాధా లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్పర్సన్ గణేష్ కుమార్, బిజెపి రాష్ట్రనాయకులు బి.కొండయ్య, చంద్రకాంత్ గౌడ్, కోళ్ల వెంకటేష్, వార్డు కౌన్సిలర్లు, పీఈటీలు, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి



క్రీడాజ్యోతిని వెలిగించిన మంత్రి వాకిటి శ్రీహరి



క్రీడాకారులతో మంత్రి, కలెక్టర్

# యువతలోని సామర్థ్యాన్ని వెలికితీసే సాధనం క్రీడలు

(మొదటి పేజీ తరువాయి)

సాధనమని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి సీఎం కప్-2025 పోటీలు యువ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించుకునే గొప్ప వేదికగా నిలుస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అపారమైన ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం లభిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మహబూబ్‌నగర్‌జిల్లా పేరును గర్వంగా నిలబెట్టగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందుకే, ముఖ్యమంత్రి స్వయంగా ఫుట్‌బాల్ క్రీడాకారుడు కాబట్టి, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, స్పోర్ట్స్ యునివర్సిటీని సైతం ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. క్రీడారంగంలో యువత మరింతగా ముందుకు రావాలని, గెలుపు, ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. భవిష్యత్తులో జిల్లాస్థాయిలో మరిన్ని జాతీయ స్థాయి పోటీలు నిర్వహించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ జి.మమత శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరిఅనిత మధుసూదన్‌రెడ్డి, కార్పొరేటర్లు ఉమర్‌కొత్వాల్, సిబి శ్రీపూజి, టి.రమేష్ బాబు, నాయకులు సిజెబెనహర్, గోపాల్‌యాదవ్ డివైఎస్ఓ శ్రీనివాస్, క్రీడా అధికారులు పాల్గొన్నారు.



బాక్సింగ్, పోట్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



క్రీడాకారులు



కార్యక్రమానికి హాజరైన పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ॥ జిఎన్ శ్రీనివాస్

## ఓయూ సదస్సుకు పియు ఉపకులపతి

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి20 ప్రభాతవార్త:** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సెంట్రల్ జోన్ వైస్ ఛాన్సలర్స్ మీట్ 2025,26 నిర్వహించిన క్రియేటింగ్ ఏ ఐ క్వాంటుం ఎనెబుల్డ్ హయ్యర్ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ అనే అంశంపై జరిగినటువంటి ప్రోగ్రామ్‌లో శుక్రవారం పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ॥ జిఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యక్రమానికి రాష్ట్రగవర్నర్‌తో పాటు సెంట్రల్ జోన్ వైస్ ఛాన్సలర్స్ హాజరయ్యారు.

## ఆచారిపై పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలి



ఫిర్యాదు చేస్తున్న మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షులు మట్ట పరమేశ్వర్ గౌడ్

**వెల్దండ, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారిపై సోషల్ మీడియాలో ఆయనను కించపరిచే విధంగా పోస్టులు పెట్టిన అజిలాపూర్ గ్రామ సర్పంచ్ సిద్ధగొని రమేష్‌గౌడ్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆచారి మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షులు మట్ట పరమేశ్వర్ గౌడ్ శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై కురుమూర్తికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ గత మూడు రోజుల నుండి రమేష్‌గౌడ్ ఆచారిపై ఉద్దేశపూర్వకంగా పోస్టులు పెట్టి అవమాన పరుస్తున్నాడని, ఇట్టి విషయంపై విచారణ జరిపి చట్ట పరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కురిమిద్ద యాదగిరి తదితరులు ఉన్నారు.

## బోగస్ ఓటర్లపై ప్రత్యేక దృష్టికి సారించండి : మాజీ ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి)

భారతీయ జనతా పార్టీ తరపున అధికారులకు సహకరిస్తున్నప్పటి కీ బోగస్ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నామని అన్నారు. బోగస్ ఓటర్ల జాబితాపై భారతీయ జనతా పార్టీ ఊరుకునే పరిస్థితి లేదన్నారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఆర్డిఓ స్పందించి బోగస్ ఓటర్లను జాబితానుంచి తొలగించేందుకు ప్రత్యేక ఏరివేత కార్యక్రమంపై దృష్టి సారిస్తామని బిజెపి రాష్ట్ర నాయకులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కు హామీ ఇచ్చారు. బోగస్ ఓటర్ల అభ్యంతరాల పై వివరించిన వారి లో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, జాతీయ నాయకులు మంగ్యా నాయక్, మండికారి బాలాజీ, రేణయ్య అచ్చంపేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బల్మూరు జానకి, మహేశ్వరి, తేజస్విని, నీలాబాయి, మహేందర్, శంకర్ మాదిగా, అజయ్ రాజు, చందు లాల్, శివ చంద్ర, అమర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మక్తల్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అలుకూరి రవికుమార్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని మైనార్టీ సోదరులకు మక్తల్ పట్టణంలోని షరీఫా మసీదులో ఇఫ్తార్ విందుఅందించారు. సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ఉపవాస దీక్ష ముగించగా, అనంతరం రవికుమార్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. దాదాపు 15 నుంచి 20 సంవత్సరాల నుంచి ప్రతి ఏటా రవికుమార్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును అందిస్తున్నారని ఈ సందర్భంగా ఆయనకు మసీదు కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మారెడ్డి, వాకిటి హన్మంతు, కట్టా సురేష్‌గుప్తా, కోళ్లవెంకటేష్, చంద్రకాంత్ గౌడ్, వార్డు కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.